క్లుప్తంగా

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు బుధవారం బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన విశ్వ మానవత ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి సౌజన్యంతో ఈ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు మంజూరు చేసింది. ఈ బస్‌పాస్‌లను రూ.50 సాధారణ లామినేషన్‌తో తయారు చేసి వాటిని విద్యార్థులకు అందజేశారు. శ్రీనివాసచౌదరి రూ.10 వేల ఖర్చుతో వీటిని అందజేసినట్టు ఆర్టీసీ డిపో ప్రతినిధులు జీడీవీపీ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శాంతి సునీత, ఎంఈవో–2 యరమాటి సత్యనారాయణ, కాంప్లెక్స్ సెక్రటరీ లచ్చిరెడ్డి సత్యనారాయణ, డీఆర్పీ ఎం.విజయకుమార్, సీఆర్పీ కె.రాములు పాల్గొన్నారు.

నేడు కేదారిలంకలో ఎమ్మెల్సీ తోట పర్యటన

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంకలో గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటించనున్నారు. గోదావరి వరద పరిస్థితిని అధికారులతో సమీక్షించనున్నారు. గ్రామంలో నిర్వహించనున్న జగనన్న సురక్ష గ్రామసభలో పాల్గొంటారు. అనంతరం రూ.25 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభిస్తారు.

జగనన్న సురక్ష నేటికి వాయిదా..

కె.గంగవరం: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం జరగాల్సిన జగనన్న సురక్ష క్యాంపులు నేటికి (గురువారం) వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కె.గంగవరం, శేరిలంక గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యాంపులు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. లబ్ధిదారులు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా క్యాంపుల వద్ద దరఖాస్తు అందిస్తే ఒక్క రోజులోనే ఉచితంగా పత్రాలు అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్, మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి విద్యుత్‌లైన్లలోని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. గృహావసర వినియోగదారులతో పాటు, ఆక్వా, ఇండస్ట్రియల్ ఫీడర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు.

'అడ్డాల'కు ఎమ్మెల్సీ తోట పరామర్శ



కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్డాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: అనారోగ్యంతో కాకినాడలోని ఒ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగర– 1 ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. తీవ్ర అనారోగ్యానికి గురవడంతో శ్రీనివాస్ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తోట అడ్డాలను పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు.

శ్రీవరప్రకాష్‌కు వెంకన్నబాబు పరామర్శ

మండపేట: సతీ వియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు పరామర్శించారు. మండపేటలోని ఆయన స్వగృహానికి వచ్చి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ, అబ్బిరెడ్డి వీర్రాజు పరామర్శించారు. అలాగే ద్వారపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్ శ్రీవరప్రకాష్‌కు తమ ప్రగాడ సంతాపాన్ని తెలిపింది. సంఘ అధ్యక్షుడు పాలినాటి సత్యనారాయణ, నాయకులు జిల్లా శ్రీను, తోరం శ్రీనివాసరావు, పూండ్రపు సత్యనారాయణ, మేకా రాజు తదితరులు శ్రీవరప్రకాష్‌ను పరామర్శించారు.

ప్రజాస్వామిక ఆయుధం ఓటు

- వేగంగా నూతన ఓటరు జాబితా తయారీ ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో ఓటు నమోదు కార్యక్రమాలు
- పారదర్శకతకు ప్రాధాన్యం
- అక్టోబర్ 17న ముసాయిదా జాబితా విడుదల
- అభ్యంతరాల పరిశీలన అనంతరం 2024 జనవరి 5న తుది జాబితా
- ప్రస్తుతం రెండు నియోజకవర్గాల్లో 4,14,285 మంది ఓటర్లు



అంగరలో సర్వే చేస్తున్న వీఆర్వో తదితర సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజల భాగస్వామ్యంతో ప్రజలు మెచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే మార్గం ఓటు... ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు నచ్చిన నేతను పాలకుడిగా ఎన్నుకునే వీలు రాజ్యాంగం కల్పించింది. అంతటి ప్రాధాన్యం గల ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఎన్నికల కమిషన్, ప్రభుత్వ యంత్రాంగం కృషిని ప్రారంభించింది. ఆ ప్రక్రియపై ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక పట్టణం, మూడు మండలాలు ఉండగా పురుషులు 99,602, స్త్రీలు 99,886, థర్డ్ జెండర్ ఏడుగులు మొత్తం 1,99,495 మంది ఓటర్లు ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో ఒక పట్టణం మూడు మండలాలు ఉండగా పురుషులు 1,04,883 మంది, స్త్రీలు 1,09,904, థర్డ్ జెండర్ ముగ్గురు మొత్తం 2,14,790 మంది ఉన్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 4,14,285 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 5,305 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఓటు నమోదు కార్యక్రమం ఇలా..

ఈనెల 21 నుంచి ఓటు నమోదు కార్యక్రమాలను ప్రారంభించారు. ఆగస్టు 20 వరకూ కొనసాగనున్నాయి. అక్టోబర్ 17న ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటిస్తారు. దానిపై నవంబర్ 30 వరకూ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించే వీలుంది. 2024 జనవరి 5న ఎన్నికల సంఘం తుది ఓటర్లు జాబితాను విడుదల చేస్తుంది. ఓటు నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలన్నీ పూర్తి పారదర్శకంగా చేపడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. రాజకీయ పార్టీల తరపున అధికారికంగా నియమితులైన బూత్‌స్థాయి ఏజెంట్లు కూడా జాబితా తయారీ ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. కళాశాలలు, బీఎల్‌ఓలంతా సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ సర్వే చేసి కొత్త ఓటర్లను గుర్తిస్తున్నారు. దొంగ ఓట్లను తొలగించడమూ, తొలగింపు నిబంధనలకు విరుద్ధంగా జరిపితే తొలగించిన ఓట్లను పునరుద్ధరించడమూ చేస్తారు. ఓటరు జాబితాలో తన ఓటు ఉన్నదీ లేనిదీ చూసుకునే సదుపాయాన్ని కల్పించారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, నకిలీ ఓట్లను ఆధారాలు చూపి, జాబితా నుంచి తొలగించేలా చేసే వీలు ఉంది.

పారదర్శకంగా ఓటరు నమోదు సర్వే



నూతన ఓటరు జాబితా ముసాయిదా తయారీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బీఎల్‌ఓల బృందం క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. నిష్పక్షపాతంగా జాబితాలో పేర్ల చేర్పు, మార్పు, తొలగింపు ప్రక్రియలు చేస్తారు. అన్నివర్గాల ప్రజలు జాబితా తయారీకి సహకరించాలి.

– కొమరం సూర్యారావు, తహసీల్దార్, కపిలేశ్వరపురం



ఓటరు జాబితా

2023 ఏప్రిల్ నాటికి మండలాల వారీగా ఓటర్లు ఇలా...

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
రామచంద్రపురం టౌన్	16,737	17,908	03	34,648
రామచంద్రపురం(రూ)	28,591	28,561	02	57,154
కాజులూరు	28,059	27,747	00	55,806
కె.గంగవరం	26,215	25,670	02	51,887
మండపేట టౌన్	22,199	24,590	01	46,790
మండపేట రూరల్	30,660	32,199	01	62,860
రాయవరం	25,905	26,869	01	52,775
కపిలేశ్వరపురం	26,119	26,246	00	52,365
మొత్తం	2,04,485	2,09,790	10	4,14,285

పారదర్శకంగా ప్రభుత్వ పాలన

రామచంద్రపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ 11వ సచివాలయం పరిధిలోని 25, 28 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వేణు వివిధ ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటుగా వాటికి అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను ఇంటి వద్దకే అధికారులు అందించే విధంగా సీఎం జగనన్న సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వమే ఉచితంగా ఎటువంటి దళారుల ప్రమేయం లేకుండా 11రకాల ధ్రువపత్రాలను ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ముడుపులు చెల్లిస్తేనే కానీ సర్టిఫికెట్లు అందేవి కాదని, ఆ పరిస్థితి లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ కార్యాక్రమాలతో పాటుగా సర్టిఫికెట్లను పారదర్శకంగా ఇవ్వటం జరగుతుందని మంత్రి అన్నారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ కేతా శ్రీను, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు కొండేపూడి సురేష్, కోటిపల్లి శివాజీ, కుడిపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష గ్రామసభలో ధ్రువపత్రాలు అందిస్తున్న మంత్రి వేణు



శీలలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని పలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. బుధవారం శీల గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండల తహసీల్దార్ సాయిసత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకూ నవరత్నాలను ప్రవేశపెట్టి కులమతాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. ఏ కారణం చేతనైనా ఇంకనూ పథకాలు అందకుండా మిగిలిపోయిన లబ్ధిదారులు ఉంటే వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వలంటీర్ల ద్వారా అధికారులే లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జల్లుల్లోనే జనజీవనం



మండపేటలో వర్షంలోనే రాకపోకలు



పామర్రులో ఉధృతంగా ప్రవహిస్తున్న రాజు కాలువ

- తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం

మండపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా జల్లులతో కూడిన వర్షం పడుతూనే ఉంది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జన జీవనం స్తంభించింది. తప్పనిసరి పరిస్థితుల్లో వర్షంలో తడుస్తూనే విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తదితర వర్గాల వారు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. మండపేట పట్టణంలోని అంబేడ్కర్ నగర్, గాంధీనగర్, సైదిల్‌పేట, బ్యాంకు కాలనీ, న్యూ కాలనీ తదితర ప్రాంతాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ద్వారపూడి శివారు వేములపల్లి, ఏడిద, కేశవరం, తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.

నియోజకవర్గంలో 70 శాతం మేర తొలకరి నాట్లు పూర్తి కాగా ఏక ధాటిగా పడుతున్న జల్లులతో పల్లపు ప్రాంతాల్లోని పొలాలు నీట మునుగుతున్నాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే నాట్లుకు నష్టం ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ప్రస్తుత వర్షాల వలన పంటకు నష్టం ఏమీ లేదని వ్యవసాయాధికారులు అంటున్నారు. వర్షపు నీరు బయటకు పోయేందుకు బాటలు చేయాలని సూచిస్తున్నారు.

వదలని ముసురు

కె.గంగవరం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వర్షం పడితే మంచిదేనని రైతులు ఆనందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి చినుకుచినుకుగా కురిసిన వర్షం ఉదయానికి జోరందుకుంది. వర్షం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లోని పల్లపుప్రాంతాలు నీటమునిగాయి. కె.గంగవరం మండలంలోని ప్రధాన కాలువలు వర్షపునీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోజంతా వర్షం పడడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

వరదతో లంక గ్రామాల్లో గుబులు

కపిలేశ్వరపురం: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. ఎగువ నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద మంగళవారం రాత్రికి తగ్గిన నేపథ్యంలో మండలంలోని లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉన్నట్టుండి బుధవారం మధ్యాహ్నం నుంచి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీని ప్రభావంతో గురువారం ఉదయానికి జిల్లా సమీప తీర గ్రామాలు ముంపుబారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 16.75 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అదే పరిస్థితి వస్తే కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాలు ముంపు బారిన పడతాయి. దీంతో క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేసినట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు తెలిపారు. పలు శాఖల అధికారులతో కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప, తాతపూడి గ్రామాల్లో గోదావరి గట్లును పరిశీలించారు.



కోరుమిల్లి వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్

కిట్స్‌లో కార్గిల్ విజయ్ దివస్



కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల బృందం

రామచంద్రపురం రూరల్: మండలంలోని అంబికపల్లి అగ్రహారంలో రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మాజీ ఇండియన్ ఆర్మీ లెఫ్టినెంట్ కలనల్ శ్రీనివాస్‌ను ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దేశ రక్షణ, క్రమ శిక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. రక్షణ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై వివరించారు. దేశ రక్షణకు తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాజీ ఆర్మీ అధికారి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ బర్ల, డైరెక్టర్లు వంశీ పవన్, రామారావు, రవిధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యానికి సోషల్ సర్వీస్ పురస్కారం

రామచంద్రపురం: ఆకృతి ఎస్‌ఎస్ ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన పెంకే సుబ్రహ్మణ్యం ఇంటర్‌నేషనల్ పీస్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులకు వివరాలను తెలియజేశారు. ఈనెల 22న పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ జార్జ్ ఫ్రండ్‌పేటర్(జర్మనీ), టి.వినోగ్రదోవ(రష్యా)ల చేతుల మీదుగా డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ డాక్టరేట్ రావడానికి కారకులైన ఆకృతి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కఠారి రమాదేవికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టరేట్ అందుకున్న సుబ్రహ్మణ్యంను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

టీచర్లు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుకోవాలి

- డీఈవో కమలకుమారి
- మాచవరంలో కాంప్లెక్స్ సమావేశాల సందర్శన



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

రాయవరం: ఉపాధ్యాయుడు నిరంతరం విద్యార్థిగా ఉన్నపుడే మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా బోధన చేయగలుగుతారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో ఎం.కమలకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక స్థాయి, సబ్జెక్టు స్థాయి కాంప్లెక్స్ సమావేశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల సముదాయాల్లో జరిగే సమావేశాలు వృత్తి నైపుణ్యాలకు వేదికలు కావాలన్నారు. ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాన్ని నిరంతరం పెంచుకుంటూ భావితరానికి మానవ సంపదగా నిలిచే విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లు జ్ఞాన సముపార్జన నిలయాలుగా నిలవాలన్నారు. జిల్లాలో 123 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, వీటి పరిధిలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు, అలాగే వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ స్థాయి సమావేశాలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్టు కమలకుమారి తెలిపారు. ప్రతి నెలా సమావేశాలను నిర్ణీత గడువులోగా నిర్వహించాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న ఫార్మేటివ్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం డీఈవో కమలకుమారి ఆ పాఠశాల పదో తరగతిని సందర్శించి విద్యార్థుల విద్యాస్థాయిని పరీక్షించారు. టెస్ట్‌లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. విద్యార్థుల విద్యాస్థాయిని పరీక్షించడంతో పాటుగా, వారి నోట్సులను పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలను పరిశీలించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉద్దేశించి రామచంద్రపురం డీవైఈవో పి.షాలెంరాజు, సమగ్ర శిక్ష ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవో పి.లక్ష్మణమూర్తి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జగన్మోహిని మాట్లాడారు.

మణిపూర్ ఘటనలపై యూటీఎఫ్ నిరసన

మండపేట: అల్లర్లు, మహిళలపై అమానుష దాడులతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో సంఘ నాయకులు నిరసన తెలిపారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కె.గోపాలకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి డీవీ రాఘవులు, జేవీవీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చల్లా రవికుమార్ తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెగల మధ్య దాడులను అరికట్టి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. యూటీఎఫ్ నాయకులు పి.సురేంద్రకుమార్, బేతినీడి శ్రీనివాస్, రాయుడు శ్రీనివాస్, గొల్లపల్లి రాజు, పి రామచంద్రారెడ్డి, వైవీ రమణ, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

కాజులూరు: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతుసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం కాజులూరులో నిరసనలు చేశారు. గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మహిళలపై దాడులకు, ఆ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండకు నిరసనగా సీఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలన్నారు.

హజ్రత్ అబ్బాస్‌కు ఘన నివాళి

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 8 వ రోజు బుధవారం ముస్లిం భక్తులు ఇస్లాం వ్యవస్థాపకుడు హజ్రత్ అలీ తనయుడు, ఇమాం హుస్సేన్ సోదరుడు, సైన్యాధిపతి అయిన హజ్రత్ అబ్బాస్‌కు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన తాబూత్ (గుమ్మటాన్ని) బీబీ సకీనా పంజా నుంచి ఆగా వారి పెద్ద పంజా, నక్షా వరకు యా హుస్సేన్, యా అబ్బాస్ అంటూ నినాదాలు చేస్తూ మాతం నిర్వహించారు. నౌహా, సలాం, మర్సియలను చదువుతూ సజ్జాధియ పంజా వరకు ఊరేగించారు. ఇమాం హుస్సేన్ పరివారానికి జరిగిన విషాధాన్ని గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించారు. అనంతరం బీబీ సకీనా పంజాలో మజ్లిస్ నిర్వహించారు. యూపీలోని ఫైజాబాద్ నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా మహ్మద్ షంసి హజ్రత్ అబ్బాస్ గురించి, కర్బలా మసాయాబ్ (విషాద రూపం)లో వివరించారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అంజుమన్ సంఘాల ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.

చేనేత పితామహుడికి ఘన నివాళి



ప్రగడ కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చేనేత నాయకులు

రామచంద్రపురం రూరల్: చేనేత పితామహుడుగా పేరొందిన ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని హసన్‌బాద చేనేత సొసైటీలో చేనేత నాయకులు బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. హసన్‌బాద సొసైటీ చైర్మన్ దొంతంశెట్టి సత్య ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చేనేత సహకార సంఘాలు రాష్ట్రంలో బలంగా కొనసాగుతుండడానికి ప్రజా ప్రతినిధిగా కోటయ్య అవిరళ కృషి కారణమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శివల సొసైటీ చైర్మన్ వాసా వీర్రాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నేతల సంతాపం

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శిరోముండనం కేసులో బాధితుడు పువ్వల వెంకటరమణ మృతికి ప్రజా సంఘాల నేతలు బుధవారం సంతాపం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐఎఫ్‌టీయూ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, వెంకటాయపాలెం శిరోముండనం స్టీరింగ్ కమిటీ కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.